క్లుప్తంగా

ఇంటి పన్ను వేయాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో 1986 గోదావరి సమయంలో ఇళ్లు నిర్మించుకుని 40 ఏండ్లుగా నివాసం ఉంటున్న పేదలకు గ్రామ పంచాయతీ ద్వారా ఇంటి పన్ను వేయాలని సీపీఎం పార్టీ మండల నాయకుడు దండి రాములు డిమాండ్ చేశారు. మల్లెలమడుగులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే చేసి సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఆ సమస్యలను అధికారులు పరిష్కరించాలని అన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ములకలపల్లి: యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కార్యదర్శి కొర్సా రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల జనరల్ కౌన్సిలింగ్ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.4 వేల నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓరుగంటి శ్రీను, ఒగ్గెల మహేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో నూతన కమిటీ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఈసం అశోక్, పద్దం లక్ష్మణరావును ఎన్నుకున్నారు. ఈసం శివ, తానం రాజ్‌కుమార్, కారం బాలరాజు, గడ్డం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పూర్తి చేయాలి



పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: రూ.60లక్షల వ్యయంతో అశోక్‌నగర్‌లో కోడిపుంజుల వాగుపై చేపట్టిన పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆ పూడికతీత పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానకాలంను దృష్టిలో పెట్టుకుని గ్రామప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రమేశ్, ఏఈ సక్రు, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడిబాబు, శివ తదితరులు ఉన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



తోగ్గూడెంలోని ఓ ఇంటిలో నీటి తొట్లను శుభ్రం చేయిస్తున్న వైద్యాధికారి

పినపాక: దోమల నియంత్రణకు, ఇళ్లల్లో నిల్వ నీరు ఉండేందుకు చర్యలు చేపట్టాలని పినపాక వైద్యుడు మధు పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లకు సూచించారు. ఈ మేరకు ఆదివారం తోగ్గూడెం గ్రామంలోని పలు ఇళ్లల్లో నీటి తొట్లు, మురికి గుంటలను శుభ్రం చేసి దోమల మందు పిచికారీ చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలు రాకుండా నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందిస్తున్న ఎస్సై, క్లబ్ బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన మహిళకు వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. అశ్వారావుపేటకు చెందిన దేగల జగదీశ్వరి అనే ఒంటరి మహిళ వంట పనులు చేసుకొని జీవనం సాగించే క్రమంలో ఇటీవలె రోడ్డు ప్రమాదానికి గురి కాగా.. కుడి కాలు విరిగింది. దీంతో ఆమె జీవనం ఇబ్బందిగా మారడంతో ఈ విషయం తెలుసుకున్న స్థానిక వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై యయాతిరాజు చేతుల మీదుగా బాధిత మహిళలకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని, 25 కేజీల బియ్యంతోపాటు నిత్యావసరాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు ఎస్.బాలగంగాధర్, బోగవల్లి రాంబాబు, ముత్తా సుమాకర్, కుమార్ రాజా, మోహన్, గంగాధర్‌రావు, జల్లిపల్లి గుప్తా, జల్లిపల్లి దేవ రాజు పాల్గొన్నారు.

వరదొస్తే వణుకే!



గతేడాది వరదలకు మొట్లవాగు ప్రవాహంతో తాటిగూడెం పొలాల్లో వేసిన ఇసుక మేటలు

- పొంచి ఉన్న వర్షాకాలం వరద ముప్పు
- గతంలో పొలాల్లో ఇసుక మేటలు
- చర్యలు చేపట్టడంలో అధికారులు, పాలకులు విఫలం

కరకగూడెం: వర్షాకాలం రాగానే గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల గుండెల్లో వణుకు పుడుతోంది. ఉరుములు, మెరుపులు, చినుకులు.. ఇవన్నీ కొందరి రైతుల గుండెల్లో రైలు పరిగెత్తిస్తున్నాయి. కారుమబ్బులు కమ్ముకోగానే వారి కళ్ల ఎదుట గతంలోని విధ్వంసకర దృశ్యాలు మెదులుతున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షాలు వాగులు, చెరువులను ఉప్పొంగించి వరద నీరు పంట పొలాల్లోకి వచ్చాయి. ఫలితంగా రైతుల కష్టార్జితం ఇసుక మేటల కింద కప్పబడింది. ఈ సారి అయినా వరద ముప్పు నివారణకు అధికారులు, పాలకులు తగిన చర్యలు తీసుకోకపోవడం వారి ఆందోళనను మరింత పెంచుతోంది.

గతమెంతో నష్టదాయకం..

గత వర్షాకాలంలో మండలంలో కురిసిన భారీ వర్షాలు వాగులు, చెరువులలో నీటి ప్రవాహాన్ని అదుపు చేయలేనంతగా పెంచాయి. మండలంలోని పెద్దవాగు అధిక ప్రవాహంతో కరకగూడెం, తాటిగూడెం, కలవలనాగారం, చొప్పల, బంగారుగూడెం గ్రామాల్లో సాగులో ఉన్న పంట పొలాల్లో ఇసుక మేటలు భారీగా వేశాయి. అలాగే తాటిగూడెం గ్రామ పరిధిలోని మొట్లవాగు, ఎర్ర చెరువు అలుగు వరద పలువురి రైతుల పంట పొలాల్లోకి చొచ్చుకెళ్లి వరి, ఇతర పంటలను నాశనం చేసింది. ఇసుక, బురద మేటలు పేరుకుపోవడంతో భూమి సారవంతం కోల్పోయి, రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. ఈ నష్టాలు కేవలం ఆర్థికమే కాక, రైతుల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపాయి. రుణాలు తీర్చలేక కుటుంబ బాధ్యతలు నెరవేర్చలేక ఇబ్బందులు పడ్డారు. పంట నష్టం జరిగిన సమయంలో అధికారులు, పాలకులు గ్రామానికి వచ్చి రైతులకు భరోసా ఇచ్చారు. పరిహారం అందిస్తాం.. రక్షణ చర్యలు చేపడతాం అని హామీలు గుప్పించారు. అయితే ఆ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. ఇప్పటివరకు రైతులకు తగిన పరిహారం అందలేదు. వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టలేదు.

ముందస్తు చర్యలతో ఫలితం

వరద ముప్పును తగ్గించడానికి ముందస్తు చర్యలు కీలకం. చెరువులు, కాలువలను పూడిక తీసి బలోపేతం చేయడం, వరద నీటిని నియంత్రించడానికి డ్రెయిన్ల నిర్మాణం, లోతట్టు ప్రాంతాల్లో రైతులకు హెచ్చరికలు జారీ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. అయితే ఇలాంటి చర్యలు దాదాపు శూన్యం. అధికారులు వరద సమయంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసినా శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి సొంతంగా ప్రయత్నాలు చేస్తున్నారు కానీ అవి సరిపోవడం లేదు. వాతావరణ సూచనలను గ్రామస్థాయిలో రైతులకు తెలియజేసి పంటలకు భీమా సౌకర్యం కల్పించి నష్టం జరిగినప్పుడు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. అధికారులు పాలకులు రైతుల ఆవేదనను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి.

పరిహారం ఇవ్వలేదు..



అప్పులు చేసి నాకున్న 4 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే.. గడిచిన 2 సంవత్సరాలుగా మొట్లవాగు వరదతో నా పొలంలో భారీగా ఇసుక మేటలు వేశాయి. అధికారులు వచ్చి చూసిపోయారు. పరిహారం ఇస్తామని, కాలువలు బాగుచేస్తామని అన్నారు. కానీ ఏ ఒక్క హామీ కూడా నిలబడలేదు. ఈసారి కూడా వరదలొస్తే మా బతుకులు ఏమైపోతాయో అని నిద్రపట్టడం లేదు. ఇప్పటివరకు కూడా నాకు పరిహారం ఇవ్వలేదు. జిల్లా కలెక్టర్ స్పందించి నాకు పరిహారం అందించాలి.

– గొగ్గలి కృష్ణ, రైతు, తాటిగూడెం

రక్షణ చర్యలు చేపట్టాలి



ప్రతి వర్షాకాలం రైతులకు ఒక యుద్ధంలా మారింది. కష్టపడి పంట పండిస్తే, వరదలొచ్చి అంతా నాశనం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం, రక్షణ చేపట్టలేదు. ఇప్పటికైనా కరకగూడెం పెద్దవాగు వెంబడి రక్షణ గోడ నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– వట్టం సురేందర్, రైతు, చిరుమళ్ల

మాదకద్రవ్యాల వినియోగం హానికరం



మణుగూరుటౌన్: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరుటౌన్: గంజాయి వంటి మత్తు పదార్థాలు ఉపయోగించడం నేరమని, వాటి వల్ల ఆరోగ్యానికి హానికరమని మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మణుగూరు ఓసీ–2 దుర్గా ఓబీ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల మనిషి మెదడు, శరీరంపై సమాజంపై దుష్ప్రభావం చూపుతుందన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ రవాణా చేసినా వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగబాబు, ఎస్‌ఐలు మేడ ప్రసాద్, ట్రైనీ ఎస్‌ఐ మనీషా తదితరులు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండటంతోపాటు నిర్మూలనకు సహకరించాలని స్థానిక సీఐ పింగళి నాగరాజు రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి అశ్వారావుపేటలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తుపదార్థాలను క్రయవిక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల అనర్థాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై యయాతిరాజు, ట్రైనీ ఎస్సై అఖిల, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పినపాక: విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు అవ్వకూడదని, అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని ఎస్సై రాజ్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని అన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘సీతారామ’ నీరు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాబిర్‌పాషా

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు ఇవ్వాలని, ఆ తరువాతే ఇతర ప్రాంతాలకు తరలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌కేటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన పార్టీ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో పార్టీ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రసాద్, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్ సాయి, కమటం సురేష్, నాగేంద్రబాబు, నాగేష్, కమలాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తులే శ్రమదానం చేశారు..



రామన్నగూడెంలో చెత్త, పిచ్చిమొక్కలు తొలగిస్తున్న స్థానికులు

అశ్వారావుపేటరూరల్: పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, నీటి గుంటలతో వ్యాధుల బారిన పడుతామని, గ్రామం కోసం ఒక్క రోజు శ్రమదానం చేద్దామని ఓ మాజీ సర్పంచ్ దంపతులు పిలుపునివ్వగా.. గ్రామస్తులు స్పందించి శ్రమదానం చేశారు. అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దంపతులు మడకం స్వరూప, మడకం నాగేశ్వరరావు రెండు రోజుల క్రితం వానాకాలం సీజన్ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ‘గ్రామం కోసం ఒక్క రోజు శ్రమదానం’చేద్దాం.. అంటూ వాట్సాప్‌లో పిలుపు నిచ్చారు. ఈ పిలుపుతో ఆదివారం కొంతమంది గ్రామస్తులు స్వచ్ఛందంగా తరలి వచ్చి శ్రమదానంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారితోపాటు, అంతర్గత రోడ్లతోపాటు ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను వారంతా కలిసి తొలగించారు. ఇళ్ల వద్ద, రోడ్ల పక్కన పేరుకున్న చెత్తచెదారాన్ని తొలగించి, డ్రైన్ల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంపతులతోపాటు గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అశ్వాపురం తహసీల్దార్‌గా మణిధర్



అశ్వాపురం: మండల నూతన తహసీల్దార్‌గా మణిధర్‌ను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ రాజారావును కలెక్టరేట్‌కు బదిలీ చేసి ఐటీడీఏ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మణిధర్‌ను ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సోమవారం మణిధర్ బాధ్యతలను చేపట్టనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దుమ్ముగూడెం: మండలంలోని పెర్టిలైజర్ షాప్స్ గుమాస్తాల యూనియన్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా నరేష్, వైస్ ప్రెసిడెంట్‌గా సుధాకర్‌లతో పాటు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. గుమాస్తాలకు ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని, హెల్త్‌ఇన్సురెన్స్ చేయించాలని కోరారు. లారీ లోడింగ్ సమయంలో టిఫిన్, భోజనం ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పదోన్నతిపై హర్షం

మణుగూరుటౌన్: ఆపరేటర్లకు ఏ గ్రేడ్ పదోన్నతి పత్రాలు అందించాలని తమ సంఘం చేసిన విజ్ఞప్తి మేరకు ఏరియాలో 13 మంది ఆపరేటర్లకు పదోన్నతి పత్రాలు అందించడంపై టీబీజీకేఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం పట్ల ఏరియా యాజమాన్యం చిత్తశుద్ధి నిబద్ధతో పనిచేయడం స్ఫూర్తిదాయకమైన అంశమని కొనియాడారు. ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి పత్రాలు అందించిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు అందిస్తున్న డాక్టర్

గుండాల: ఖమ్మం సురక్ష హాస్పిటల్ ఫిజీషియన్ కన్సల్టేషన్ ఎండీ డాక్టర్ రుద్ర గౌతమ నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం ముత్తాపురంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో 160 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య సేవలు అందించేందుకు సురక్ష హాస్పిటల్ హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రుద్ర గౌతమ నరేష్ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల మొత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్ కుమార్, సురక్ష హాస్పిటల్ మేనేజర్ సైదేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ దొండపాటి రమేష్, పీఆర్‌టీ నవీన్, నరసింహారావు, తవిడిశెట్టి రాంబాబు, ఎస్‌కే షారోజ్, పల్లెర్ల రవి వర్మ, మంకిడి సుధాకర్, ఫార్మసీ ప్రేమ్ హాస్పటల్ సిబ్బంది మున్ని, ఉమా, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

‘సీపీఐతో ప్రజా సమస్యలు పరిష్కారం’



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మణుగూరురూరల్: భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ప్రజలకు అండగా ఉండి అనేక పోరాట, ఉద్యమాలు నిర్వహించడం ద్వారానే అనేక సమస్యలను పరిష్కారమయ్యాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య అన్నారు. ఆదివారం పీవీకాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో, కూనవరం ఎంసీ క్వార్టర్స్, బాంబేకాలనీ, బాపనకుంటలలో జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నిల్లో సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీన జరిగే మహాసభలకు కార్యకర్తలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతన గ్రామశాఖ కమిటీలను ఎన్నుకున్నారు. బాంబేకాలనీ శాఖ కార్యదర్శిగా కొయ్యడి శేఖర్, సహాయ కార్యదర్శిగా గూడూరు కృష్ణారెడ్డి, పీవీకాలనీ–మల్లారం శాఖ కార్యదర్శిగా దాట్ల సందీప్, సహాయ కార్యదర్శిగా రత్నం శివకుమార్, ఎంసీ క్వార్టర్స్ శాఖ కార్యదర్శిగా ఈసం శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా హుస్సేన్, బాపనకుంట శాఖ కార్యదర్శిగా చల్లా కాంతారావు, గౌరవ అధ్యక్షుడిగా చింతల దశరథంలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మాజీ సర్పంచ్ పాయం కామరాజు, నాయకులు పులిగిల్ల రమేష్, ఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వంతెన వద్ద.. పొంచి ఉన్న ముప్పు



రెయిలింగ్ విరిగి ప్రమాదకరంగా ఉన్న వంతెన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాత రెడ్డిగూడెం గ్రామ శివారులోగల వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెన రెయిలింగ్‌ను ఏడాది క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ధ్వంసం కాగా, ఆ నాటి నుంచి తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. మూల మలుపు వద్ద ఉన్న వంతెనకు రెయిలింగ్ ప్రమాదకరంగా ఉండటంతోపాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. తక్షణమే అధికారులు స్పందించి వంతెన రెయిలింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా కల్తీ పెట్రోల్ విక్రయాలు?

దుమ్ముగూడెం: మండలంలోని పెట్రోల్ బంక్‌లలో కల్తీ పెట్రోలు విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానాలు ఉన్నాయని మండల కాంగ్రెస్ నాయకుడు కోడి చంటి ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మండలంలోని ద్విచక్ర వాహనాలు దారి మధ్యలో ఆగిపోతే బాటిల్ పట్టుకుని బంక్‌ల దగ్గరకు వెళ్తే పెట్రోల్ పోయడం లేదని తెలిపారు. బాటిల్‌లో పోస్తే కల్తీ పెట్రోల్ విక్రయాల విషయం బయటకు వచ్చే అవకాశాలు ఉండటంతో పోయడం లేదని, తక్షణమే బంక్‌లపై అధికారులు తనిఖీలు చేపట్టి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బూర్గంపాడు: జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు..

బూర్గంపాడు: ఎస్ జేపీమ్ బూర్గంపాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1988–90 ఇంటర్ మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఆ కళాశాలలో ఘనంగా జరిగింది. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు నుంచీ విద్యార్థులు తరలివచ్చారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు.. గత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉదయం కాలేజీలోని సరస్వతి మాతాకు పూలమాల వేశారు. ఆ తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1988–90 బ్యాచ్ జూనియర్ కళాశాల విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు నలజాల వెంకటరావు అధ్యక్షతన పూర్వ విద్యార్థులు సమావేశమై కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తీర్మానించారు. ఇలాంటి కార్యక్రమాలు రాబోయే కాలంలో కూడా జరపాలని నిర్ణయించారు. అనంతరం పూర్వ విద్యార్థి సంఘ నాయకులందరినీ ఘనంగా సన్మానించారు. తమకు చదువు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అప్పటి విద్యార్థి సంఘం నాయకులు నలజాల వెంకటరావు, తోటా కోటేశ్వరరావు, రెడ్డెం నరసింహారెడ్డి, ఉమామహేశ్వరరావు రామ్ లాల్, రామారావు, పి.వెంకటేశ్వర్లు రాజ్యలక్ష్మి, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘క్లీన్ మణుగూరు’కు అడుగులు

- 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక
- ప్రతి వార్డులోనూ చెత్త, పిచ్చిచెట్ల తొలగింపులు
- వరద ముంపు తప్పించేందుకు చర్యలు

మణుగూరుటౌన్: గతేడాది ముంపును పరిగణలోకి తీసుకుని వానకాలం వచ్చే వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రోగాలు ప్రబలకుండా, పట్టణంలో పారిశుద్ధ్య లోపం లేకుండా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. వార్డుల వారీగా డ్రెయిన్ల మురుగు తొలిగింపు, చెత్త, పిచ్చి మొక్కల తొలిగింపు వంటి కార్యక్రమాలు చేపడుతుండటంతో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల వార్డులను ఎంపిక చేసి పనులు చేపడుతున్నారు.



మున్సిపాలిటీలోని ఓ వీధిలో డ్రెయినేజీలోని మురుగు తొలగిస్తున్న సిబ్బంది

ప్రణాళికలో ఇలా..

జూన్ మొదటి వారం నుంచి ప్రారంభమైన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులో వార్డు ఆఫీసర్లు, ఆర్‌పీలు పర్యటించి సమస్య తీవ్రతను ఆధారంగా వార్డుల ఎంపిక చేస్తారు. అనంతరం ఎంపిక చేసిన వార్డుల్లో డ్రెయినేజీల్లో సిల్ట్ తొలిగింపు, పిచ్చిచెట్ల తొలిగింపుతో పాటు తడిచెత్తతో కంపోస్ట్ తయారీ వాటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా వానకాలం రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఖాళీ వస్తువుల్లో నిలిచిన నీటిని తొలిగించకపోవడం వల్ల కలిగే అనర్థాలను క్షుణ్ణంగా వివరిస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించి వాటిని సమీప కాల్వల్లో వేయడం ద్వారా కలుగుతున్న దుష్పరిణామాలను వివరిస్తున్నారు. వర్షపునీరు నిల్వచేసుకునేందుకు ఇంకుడుగుంతల ప్రయోజనం వివరించడంతో పాటు కూల్చిన నిర్మాణాల వ్యర్థాలను కాల్వలో వేయడం ఫలితంగా డ్రెయినేజీల్లో మురుగు నిల్వ వల్ల ఇబ్బందులను వివరిస్తున్నారు. చెత్త తొలిగింపు, పొడిచెత్త సేకరణ, తడిచెత్తతో హోం కంపోస్టులపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం పట్ల వార్డుల్లో ప్రధాన సమస్యగా ఉన్న పారిశుద్ధ్య లోపాన్ని తొలిగించవచ్చన్న అధికారుల ప్రణాళిక సత్ఫలితాలనిస్తున్నాయి.



తడిచెత్తతో కంపోస్టు, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుపై అవగాహన..

పరిశుభ్రత అందరి బాధ్యత



ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి. వానకాలం నేపథ్యంలో ఇంట్లో చెత్త పరిమాణాన్ని తగ్గించాలి. చేతి సంచుల వినియోగం పెంచాలి. గృహిణులు తడిచెత్తను కంపోస్టుగా మార్చుకునే ఏర్పాట్లు చేసుకోవాలి. వానకాలం నీటిని ఒడిసిపట్టుకునేందుకు ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి. ఫలితంగా రోడ్లపైకి చేరే చెత్తను తగ్గించడంతో పాటు మురుగు, వరద నీరు సాఫీగా కాల్వల్లో వాకాలం పారి ముంపు ప్రభావం తగ్గుతుంది.

– మున్సిపాలిటీ కమిషనర్ టి.ప్రసాద్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్.దుర్గారాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416